www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 15 జులై 2023





సంస్కృత గ్రంథాలు పరిశీలిస్తున్న గవర్నర్

'జాబిల్లి' కోసం..!



ప్రజాశక్తి-సూళ్లూరుపేట, యంత్రాంగం

'ఎన్నాళ్లో వేచిన హృదయం.. ఈనాడే ఎదురయ్యింది.. ఇన్నినాళ్లు దాచిన హృదయం ఎగిసి ఎగిసి పడుతోంది..' షార్‌లో అందరి పరిస్థితి ఇదే. ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. జాబిలిపై అడుగు పెట్టాలన్న భారత చిరకాల స్వప్నం శుక్రవారం కార్యరూపం దాల్చింది. చంద్రయాన్ 3 విజయవంతం కావాలని, చంద్రుని వెనుకభాగంలో అడుగుపెట్టి లోతుగా అధ్యయనం చేయడమే కాకుండా, దాగి ఉన్న అనేక రహస్యాలను వెలికి తీసేందుకు చంద్రయాన్ 3ను శుక్రవారం ప్రయోగించారు. ఇప్పటివరకూ చంద్రుని వెనుక భాగంలో అడుగు పెట్టని ప్రపంచం ప్రస్తుతం షార్‌వైపే చూస్తోంది.

శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నుంచి బాహుబలి రాకెట్ ఎల్‌విఎం-3,ఎం 4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా చంద్రయాన్-3 ప్రయోగం సరిగ్గా మధ్యాహ్నం 2.35 నిముషాలకు ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా ప్రయోగించారు. ఈ ప్రయోగానికి 25.30 గంటలు కౌంట్‌డౌన్ ప్రక్రియ జరిగింది. గురువారం మధ్యాహ్నం 1.05కు కౌంట్ డౌన్ ప్రారంభమయ్యింది. ఇప్పటిదాకా ప్రపంచంలోని ఏ దేశమూ వెళ్లని చంద్రుడి రెండో వైపుకు ల్యాండర్, రోవర్‌లను నింగిలోకి పంపారు. దాంతో అన్ని దేశాల చూపు భారత్‌వైపే ఉంది. అందుకే ఈసారి గురి తప్పొద్దనే పట్టుదలతో ఇస్రో సకల జాగ్రత్తలూ తీసుకుంది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ బుధవారం నుంచీ షార్‌లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలతో సమీక్షించారు. చంద్రుడ్ని లోతుగా అధ్యయనం చేసి, అక్కడ దాగున్న అనేకానేక రహస్యాలను వెలికి తీయడమే చంద్రయాన్-3 ప్రయోగం ప్రధాన లక్ష్యం. ఇప్పటి దాకా ఎన్నో దేశాలు చంద్రునికి ముందు వైపు అంటే ఉత్తర ధ్రువంపై పరిశోధనలు చేశాయి. భారత్ మాత్రం చంద్రయాన్-1 నుంచి తాజా చంద్రయాన్-3 వరకూ చంద్రుని వెనుక వైపు, అంటే దక్షిణ ధ్రువాన్ని పరిశోధించేందుకే ప్రయత్నిస్తూ వస్తోంది. అందులో భాగంగా చంద్రయాన్-3 ల్యాండర్‌ను సూర్యరశ్మి పడని చంద్రుని దక్షిణ ధ్రువపు చీకటి ప్రాంతంలో దించనున్నారు.

చంద్రయాన్-3 బరువు 3,920 కిలోలు. ఇందులో ప్రొపల్షన్ మాడ్యూల్ 2,145 కిలోలు, ల్యాండర్ 1,749 కిలోలు, రోవర్ 26 కిలోలుంటాయి. చంద్రయాన్-2 వైఫల్యంతో చంద్రుడిపై ఇస్రో పరిశోధనలు ఆగిపోయాయి. చంద్రయాన్-2లో 14 పేలోడ్స్ పంపగా చంద్రయాన్-3లో 5 ఇస్రో పేలోడ్స్ మాత్రమే పంపారు. చంద్రయాన్-3 ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్లలో అత్యాధునిక సాంకేతిక పరికరాలను అమర్చి పంపారు. ఇందుకోసం ఇస్రో శాస్త్రవేత్తలు 2 నెలలుగా అహర్నిశలు శ్రమించారు.

చంద్రయాన్ 2 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా గూడూరు పట్టణంలోని సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు 'ఆలిది బెస్ట్ ఇస్రో' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గూడూరు టవర్‌క్లాక్ వద్ద ప్రయోగాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, జమీర్, మనోజ్, దయాకర్, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండి రవి సన్నారెడ్డి ఇస్రోకు అభినందనలు తెలియజేశారు. తిరుపతి ఎంపి గురుమూర్తి ప్రత్యక్షంగా చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షించారు. తొలిదశ విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. వారికి ఎంపి శుభాకాంక్షలు తెలిపారు.



సంస్కృతం లేనిదే సంస్కృతి లేదు

రాష్ట్ర గవర్నర్ మహమ్మద్ నజీర్

ప్రజాశక్తి - క్యాంపస్

సంస్కృతం ప్రపంచంలోని పురాతన భాషలలో ఒకటని, సంస్కృతం లేనిదే సంస్కృతి లేదు అని రాష్ట్ర గవర్నర్ మహమ్మద్ నజీర్ అన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, మైసూర్‌లోని సంస్కృతి ఫౌండేషన్ల సహకారంతో జాతీయ సంస్కృత సదస్సును నిర్వహించేందుకు ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని వేదికగా ఎంచుకున్నందుకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాహిత్య అకాడమీకి అభినందనలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం చేరుకున్న రాష్ట్ర గవర్నర్‌కు పూర్ణకుంభ స్వాగతం లభించింది. చెలికాని అన్నారావు భవన్ లో ఏర్పాటు చేసిన విజ్ఞాన, పుస్తక, వస్తు ప్రదర్శని, పాండు లిపి, తాళపత్ర గ్రంథాల ప్రదర్శనను తిలకించి, జాతీయ సంస్కృత సదస్సు ముగింపు సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ సంస్కృత సమ్మేళనం నిర్వహించి సంస్కృత సాహిత్యం, భాష పునాది అనే వాస్తవ అంశంపై ప్రజలలో అవగాహన పెంచడం అనే దృష్టితో నిర్వహించబడడం సంతోషంగా ఉందని అన్నారు. రాజ్యాంగంలో భారతదేశం యొక్క 22 అధికారిక భాషలలో ఒకటిగా గర్వంగా పేర్కొనబడిన హిందీ, కన్నడ, మలయాళం వంటి ఇతర భారతీయ భాషలపై సంస్కృతం ప్రధాన ప్రభావాన్ని చూపిందని, నేటికీ కర్ణాటక (నా స్వరాష్ట్రం) మధ్యప్రదేశ్‌లోని ఐదు గ్రామాలలో సంస్కృతం ప్రథమ భాషగా వుందన్నారు. చైనా, థాయిలాండ్, శ్రీలంక, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్‌లో మాట్లాడే భాషలపై సంస్కృతం ప్రభావితమయ్యాయి అన్నారు. భారతదేశం 5000 భాషల భాండాగారాన్ని కలిగి ఉన్నప్పటికీ, సంస్కృతం మాత్రమే పవిత్రమైన భాషగా పరిగణించబడుతుందన్నారు. తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అనే సంస్థలతో రెండు ప్రసిద్ధ ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయన్నారు. యూనివర్శిటీ లైబ్రరీలో సుమారు 1,22,946 పుస్తకాలు సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళం, దేవనాగరి, గ్రంథం, తెలుగు, కన్నడ, తీగలరి మొదలైన వివిధ లిపిలలో 6000 కంటే ఎక్కువ మాన్యుస్క్రిప్ట్‌లు వున్నాయి, మహాత్మా గాంధీ ఒకసారి సంస్కృతం ప్రాముఖ్యత గురించి చెబుతూ సంస్కృత అధ్యయనం లేకుండా భారతీయుడు నేర్చుకోలేడని అన్నారు. సుప్రసిద్ధ జర్మన్ ఫిలాలజిస్ట్, ఓరియంటలిస్ట్ అయిన మాక్స్ ముల్లర్ ఋగ్వేదాన్ని మొదటిసారిగా అనువదించి 1874- 1884 మధ్య 49 సంపుటాలలో తన 'ది సేక్రెడ్ బుక్స్ ఆఫ్ ది ఈస్ట్' లో వివరించారన్నారు. చాలా మంది పాశ్చాత్య శాస్త్రవేత్తలు, పండితులు సంస్కృత సాహిత్యం నుండి పొందిన జ్ఞానం నుండి ప్రయోజనం పొందారని అన్నారు. అనంతరం గవర్నర్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందించి సన్మానించారు. వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, మాజీ వీసీ హరేకృష్ణ శతపతి, మహిళా యూనివర్సిటీ వీసీ భారతి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, అడిషనల్ ఎస్‌పిలు కులశేఖర్, విమలకుమారి పాల్గొన్నారు.

గవర్నర్ కు ఘన స్వాగతం

ప్రజాశక్తి -రేణిగుంట తిరుపతి జిల్లాలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీ లో మూడు రోజుల పాటు జరుగుతున్న జాతీయ సంస్కృత సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనుటకు శుక్రవారం మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి ఘన స్వాగతం లభించింది. స్వాగతం పలికిన వారిలో కలెక్టర్ కే వెంకట రమణా రెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, కేంద్ర సాంస్కృతిక శాఖ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు, లైజన్ ఆఫీసర్ భాస్కర్ నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, ఎయిర్పోర్ట్ సి ఎస్ ఓ రాజశేఖర్, పాల్గొన్నారు. పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న గవర్నర్‌కు టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం, ఆర్డీవో కనక నరసారెడ్డి ఘనంగాస్వాగతం పలికారు.





అంతర్గత మార్గాలన్నీ ఆధునీకరిస్తున్నాం: ఎంఎల్ఎ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి నగరంలోని అంతర్గత మార్గాలన్నింటిని ఆధునీకరిస్తున్నమని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి నగరంలోని 22వ డివిజన్ పద్మావతి నగర్లో సిసి రోడ్డును తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో వున్న అంతర్గత రహదారులన్నింటిని ఆధునికరించడం జరుగుతున్నదని, ఇప్పటికే 95 శాతం పైగా రహదారులను ఆధునికరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ పైడి సునీత, కార్పొరేటర్ సంధ్య, కో ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఎస్.ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డిఈ మహేష్ పాల్గొన్నారు.

సిఎం సభ స్థల ఏర్పాటుకు సన్నాహాలు

ప్రజాశక్తి-వెంకటగిరి: ఈనెల 21వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభకు 18 ఎకరాల స్థలంలో ఏర్పాట్లను శుక్రవారం ఆర్డీవో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు. వెంకటగిరి నియోజకవర్గం నుండి వేలమంది ప్రజలు రానున్న సందర్భంగా సభా స్థలానికి అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు గూడూరు సబ్ కలెక్టర్ తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వెంకటగిరి నియోజకవర్గానికి రావడం ఇదే మొదటిసారి కావడంతో అన్నిశాఖల అధికారులు మూడు టీములుగా మున్సిపాలిటీ అధికారులు ఒక టీము, మండల రెవెన్యూ అధికారులకు ఒకటి, ఆర్ అండ్ బి అధికారులులతో మార్గాలను, హెలీఫ్యాడ్ ఫ్యాడ్ ప్రాంతాన్ని, చుట్టూ ఉన్న చెట్లను, విశ్వోదయ కళాశాల ఆటస్థలంలోనికి ముఖ్య మంత్రి కాన్వాయ్ రావడానికి రోడ్డు మార్గాన్ని మూడు వైపులా చదును చేస్తున్నారు. పరిశీలనలో మండల తహశీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్అండ్‌బి అధికారులు, విశ్వదాయ కళాశాల ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ వారు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.




ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ హైస్కూళ్లకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డుల వితరణ

ప్రజాశక్తి - సత్యవేడు

ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన, అధునాతన విద్యను అందించే ప్రయత్నంలో, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోసియేషన్ (ఎస్ జె సీ ఏ) శ్రీసిటీ పరిసరాల్లోని ఇరుగుళం, మాదనపాలెం జడ్పి హైస్కూళ్లకు ఒక్కో స్కూల్ కు ఒకటి చొప్పున 2.4 లక్షల రూపాయల విలువైన రెండు అధునాతన స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు వితరణ ఇచ్చింది. శుక్రవారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోసియేషన్ చైర్మన్ అకిరా మత్సుద ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులను లాంఛనంగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతిలో పాఠ్యఅంశాల బోధనకు స్మార్ట్ బోర్డ్‌లను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సూచించారు. జపనీస్ గ్రూప్ వితరణ పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కికువా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కొబాయాషి, పలువురు ఎస్ జె సీ ఏ ప్రతినిధులు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ బందం తదితరులు పాల్గొన్నారు.



ఇరుగుళం స్కూల్‌లో అకిరా మత్సుద

బయో మిథనైజేషన్ గ్యాస్ ఉత్పత్తిని పెంచండి : కమిషనర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ బయో మిథనైజేషన్ గ్యాస్ ఉత్పత్తిని పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా 25 ఎం.ఎల్.డి మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తూకివాకం దగ్గరున్న మహేంద్ర బయో మిథనైజేషన్ ప్లాంట్ ను శుక్రవారం పరిశీలిస్తూ పబ్లిక్, ప్రైవేట్ పార్టన్ గ్యాస్ ఉత్పత్తికి ఇకపై ప్రతిరోజూ 50 టన్నుల ఆహార వ్యర్థాలను, మార్కెట్ వ్యర్థాలను సేకరించి ప్లాంట్‌కి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, మహేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

లైన్ హైవేకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయండి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పిచ్చాటూరు

తిరుపతి జిల్లా చిత్తూరు - తచ్చూరు సిక్స్ లైన్ హైవే రోడ్డుకు పిచ్చాటూరు మండలం కారూరు వద్ద సర్వీస్ రోడ్డు, అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. రోడ్డుకు అవతలి వైపు తమ పంట పొలాలు ఉన్నాయని, రోడ్డులో దాటడానికి తమకు దారి వసతి కల్పించాలని కారూరు గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు పది రోజుల క్రితం విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఈ సమస్యను హైవే నిర్మిస్తున్న కాంట్రాక్టర్ శంకర్ రెడ్డి దష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆదిమూలం, కాంట్రాక్టర్ శంకర్ రెడ్డి తో కలిసి కారూరు వద్ద హైవే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ నుండే కలెక్టర్ కు ఫోన్ ద్వారా సమస్యను వివరించి, హైవే రోడ్డు 84 నుండి 85 కిలోమీటర్ల వద్ద సర్వీస్ రోడ్డు, అండర్ పాస్ లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తన విన్నపానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు, నాగలాపురం మండలాల వైఎస్ఆర్సిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



రేపు డయల్ యువర్ ఈవో

తిరుమల : డయల్ యువర్ ఈవో కార్యక్రమం జూలై 16వ తేదీ ఆదివారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.



విద్యార్థులందరికీ అమ్మఒడి ఇవ్వాలి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

షరతులు లేకుండా ప్రతి పేద విద్యార్థికీ అమ్మఒడి ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భగత్ రవి, ఎస్ఎఫ్ఐ సూళ్లూరుపేట నాయకులు నాగరాజు, సుమన్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ దగ్గరలోని బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు అమ్మఒడి కోతకు వ్యతిరేకంగా విద్యార్థులతో నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి మాట్లాడుతూ మొదట్లో చదివే ప్రతి బిడ్డకూ అమ్మవడి ఇస్తాం అని, చదివించడం ప్రభుత్వ భాధ్యత అంటూ చెప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డి నేడు అనేక షరతులు పెట్టి 1.34 వేల మందికి అమ్మవడి ఇవ్వకుండా దూరం చేసారని మండిపడ్డారు. ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన వారందరికీ అమ్మవడి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అర్హులందరికీ అమ్మఒడి ఇవ్వని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆర్టీసీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తిరుపతి డిపిటిఒ కార్యాలయం వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం నిరసన తెలిపారు. మల్లికార్జున అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అద్దె బస్సులు రద్దు చేయాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీనే కొనుగోలు చేయాలని వర్కుషాపులను ప్రైవేటీకరించరాదని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని, సత్యవేడు డిపోలో 13 గంటలు పనిచేయిస్తున్న సింగిల్ క్రూ డ్యూటీలను వెంటనే మార్పు చేయాలని, ఘాట్‌రోడ్డు సర్వీసు ఆపరేషన్‌లో సవరణ చేయాలని, డ్రైవర్లు మానసికంగా వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. ఆర్టీసీ సంస్థలను రవాణా విస్తరణకే వాడాలన్నారు. మహిళా కండకర్లకు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే డ్యూటీలు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కే పరశురాం, జోనల్ కార్యదర్శి సి భాస్కర్, జిల్లా కార్యదర్శి శివకుమార్, ఈ భాస్కర్ తదితరులు నాయకత్వం వహించారు.



బ్యాగుల మోత..వెన్నుపూసపై వాత..!

'నో బ్యాగ్ డే' ప్రకటనకే పరిమితం

నడుము నుంచి కాళ్లవరకూ నొప్పులు

అనారోగ్య సమస్యలతో విద్యార్థులు

ప్రజాశక్తి - బిఎన్‌కండ్రిగ

బడిలోనే హోంవర్కు కూడా పూర్తిచేసి పుస్తకాలన్నీ స్కూల్లోనే షెల్ఫ్‌ల్లో ఉంచేసి విద్యార్థులు ఇంటికి రావడం అనేది శాస్త్రీయం.. బడి సంచి బరువుపై ఎన్‌సిఆర్‌టి సర్వే నిర్వహించిన నేపథ్యంలో విద్యార్థుల బరువులో సగానికి పైగా పుస్తకాల బ్యాగులను మోస్తూ ఇబ్బందులు పడుతున్నారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే 'నో బ్యాగ్ డే' ప్రతి శనివారం పాటించాలని నిర్ణయించారు. అయితే నిత్యం ఉదయం సాయంత్రం అధిక బరువుతో ఉండే స్కూలు బ్యాగును మోసుకుంటూ విద్యార్థులు స్కూళ్లకు వెళుతూ కనిపిస్తారు. రాత్రుల్లో నడుమునొప్పి, కాళ్లనొప్పి అంటూ తల్లిదండ్రులతో ఒత్తించుకుంటూ నిద్రపోయే పరిస్థితి. పాఠశాలల్లో కమిటీలు ఏం చేస్తున్నాయో తెలియదు గానీ అటు టీచర్లు, ఇటు తల్లిదండ్రులు ఈ విషయమై స్పందించే పరిస్థితి లేదు. ఈ ప్రభావం విద్యార్థుల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

స్కూల్ బ్యాగులు మోసుకుపోవడం విద్యార్థులకు నరకప్రాయంగా మారుతుంది. బ్యాగులు మోయలేక పోతున్నాం వెనుక వైపు నొప్పి పుడుతుంది అంటూ పిల్లలు నిత్యం తమ బాధను తల్లి ఎదుట చిన్నారులు వినిపిస్తూనే ఉన్నారు. బ్యాగ్ మోతకథలు నెలలో మూడవ శనివారం నో బ్యాగ్ డే ప్రభుత్వం ఆదేశాలు చేసినా ఆచరణకు మాత్రం నోచుకోవట్లేదు. బడసంచి లేకుండా నెలలో రెండు రోజులు కూడా పాఠాలు చెప్పలేని దుస్థితి నెలకొంది. బడిసంచి బరువు తగ్గించేందుకు చాలా రాష్ట్రాల్లో పాఠశాలల్లోనే విద్యార్థుల పుస్తకాలు దాచుకునే ఏర్పాట్లు చేశారు. కానీ మన దగ్గర అంటే ఆంధ్రప్రదేశ్లో మాత్రం ఈ అవకాశం లేకపోవడంతో బ్యాగులు మోత బరువు తప్పట్లేదు. దీంతో చిన్నారులు నడుము వంగిపోయి వెన్నుపూసపై వాతపడుతున్నట్లు వైద్య నిపుణులు తెలుపుతున్నారు.

బరువును తగ్గించాలని విద్యా వైద్య నిపుణులు చేస్తున్న




సూచనలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు ఏటేటా బడి పిల్లలకు సంచి బరువు పెరగడమే కానీ తగ్గట్లేదు. తమ జీవితాల్లో వెలుగులు నింపాల్సిన పుస్తకాలను చూసి ఇష్టంగా వాటితో మమేకం కావలసిన చిన్నారులు బరువు మోయాలంటే భయపడే పరిస్థితిలో ఉన్నాయి. తమ శరీర బరువులో మూడవ వంతు బరువును ప్రతిరోజూ విద్యార్థి మోస్తూ బడికి వెళ్లి రావడం ఆరోగ్యపరంగా ఎన్నో రకాల ఇబ్బందులను తెచ్చిపెడుతుంది వెన్నుపూసతో పాటు కండరాల సమస్యలను పిల్లలు ఎదుర్కొంటున్నారు.

జాతీయ విద్యా బోధన పరిశోధన శిక్షణ సంస్థ ఎన్.సి.ఆర్.టి. బడి సంచి బరువుపై సర్వే నిర్వహించింది. నాలుగు ఐదు తరగతులు చదివే విద్యార్థులను నిశితంగా పరిశీలించారు ఆ తరగతుల విద్యార్థుల శరీర బరువు సాధారణంగా 18 నుంచి 21 కిలోలు ఉంటుంది. అదే వీరు మోసే బడి సంచి బరువు ప్రభుత్వ పాఠశాలలో నైతే పది నుండి 12 కిలోలు బరువు. అదే ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలలో 14 నుంచి 18 కేజీలు ఉంటుంది 20 నుండి 30శాతం పెరిగింది. ఇక ఎనిమిది నుండి పది తరగతులు విద్యార్థుల శరీర బరువు 45 నుండి 50 కిలోల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు అదే తరగతులు పిల్లలు బడికి వెళ్లేందుకు 20 నుండి 30 కిలోలు బరువు బ్యాగును మోయాల్సి వస్తుంది. పాఠ్యపుస్తకాలకు తోడు నీటి సీసాలు బూట్లు అదనంగా మోయాల్సి ఉంటుంది.

ప్రైవేటులో మరింత సంచి మూత

ప్రభుత్వ బడులతో పోలిస్తే ప్రైవేటు పాఠశాలలో బడి సంచిమోత బరువు ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా పిల్లల్ని రకరకాల సిలబస్ తోపాటు పాఠశాలలో ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్ ఐఐటి సీబీఎస్సీ ఇలా వివిధ రకాల పుస్తకాలను విద్యార్థులను కన్నీరు పెట్టిస్తుంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీఛార్జ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఎన్సీఈఆర్టీ బడిసంచ మోత బరువు తగ్గింపునకు స్పష్టమైన ఆదేశాలను అన్ని రాష్ట్రాలకు చేరవేసింది. దీని ప్రకారం ఒకటి రెండు తరగతులకు కేవలం రెండు పుస్తకాలు అంటే లాంగ్వేజ్ తో పాటు గణితం, ఎన్విరాన్మెంట్ పుస్తకాలు ఉండాలి. ది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిబిఎస్సి కూడా బడి పిల్లలపై ఒత్తిడి తగ్గించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తుంది అయితే ప్రస్తుతం మన బడులలో చూస్తే ఒకటి రెండు తరగతులకు 8 పుస్తకాలు ఉంటున్నాయి తరగతి పెరిగే కొద్దీ పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు చేరుతున్నాయి. 9వ తరగతి ఏకంగా 12 టైటిల్స్ ఉంటున్నాయి. పదో తరగతికి ఆ సంఖ్య మరింత పెరుగుతూ వస్తుంది. జగనన్న విద్యా కానుక కిట్లతో మోత బరువు గతంలో కంటే పెరిగింది. పిల్లలకు ఎంత ప్రయోజనం కలిగించే పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్న వాటి బరువును మోసేలా ఉందా అని ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. మోత బరువు లేని చదువులు లేకుండా చేసేందుకు ప్రవేశపెట్టిన ఆనందలహరి విద్య నాలుగేళ్ల క్రితమే అటకెక్కింది. ఏదిఏమైనా బడి సంచుల బరువుపై అటు విద్యా నిపుణులు పునరాలోచన చేసి స్కూళ్లల్లోనే పుస్తకాలను ఉంచేలా, మోతబరువు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబునాయుడిని కలిసిన శివప్రీతమ్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజలకు అంకితభావంతో సేవలు అందించాలని మాజీ ముఖ్య మంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మాజీ చిత్తూరు ఎంపీ నారపల్లి శివప్రసాద్ మనవడు కేతన్ శివప్రీతమ్‌కు సూచించారు. గురువారం విజయవాడలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబునాయుడిని మాజీ ఎంపీ శివప్రసాద్ సతీమణి డాక్టర్ విజయలక్ష్మి, అల్లుడు టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు నరసింహ ప్రసాద్‌తో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ యువతకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇవ్వబోతుందని, ఈ తరుణంలో ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయాలని శివప్రీతమ్‌కు సూచించారు.

సంక్షేమాభివృద్ధి జగనన్నకే సాధ్యం



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని పుల్లూరు, ముమ్మా రెడ్డిగుంట, పసుపుకండ్రిగ గ్రామాల్లో శుక్రవారం మండల వైసీపీ కన్వీనర్ సుధాకర్, చెంగయ్య, బాలు ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని అధికారులకు పరిష్కారానికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రిస్కిల్లా, ముమ్మారెడ్డిగుంట సర్పంచ్ రాంబాబు, వైసీపీ నాయకులు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ముగిసిన కంప్యూటర్ శిక్షణ తరగతులు



ప్రజాశక్తి-క్యాంపస్: 'నాడు నేడు' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన 15 రోజుల శిక్షణ తరగతులు ముగింపు సమావేశానికి ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిజిటల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను పాఠశాల ఉపాధ్యాయులకు కోసం నిర్వహించారని, ఈ కోర్సులో భాగంగా స్మార్ట్ బోర్డులు, స్మార్ట్ టీవీలు, బైజూస్ యొక్క ఈ-కంటెంట్ వినియోగం వంటి పరికరాలు నిర్వహణపై తరగతులు ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగాయని..కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్, హెడ్ డా.ఎం.హుమేరా ఖానంను రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో డీఈవో శేఖర్, సిబ్బంది శ్రీధర్, లత, సురేశ్, డాక్టర్ ఉషారాణి, కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అకడమిక్ కన్సల్టెంట్లు రామయ్య, హేమ, హిమచందన , సాజిదా పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం



ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పలు పాఠశాలలకు బదిలీ కాబడిన ఉపాధ్యాయులకు పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. రమణయ్య, వాణి, మోహన్ బాబు, రామక్క, స్వామి దాసు తదితరులను శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ మునెయ్య, ఉపాధ్యాయులు యువశ్రీ మురళీ, సురేష్ బాబు, నాదెండ్ల ముంళీ, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్, దేవేంద్ర, దాసు, లక్ష్మయ్య, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలను నేర్పించాలి



ప్రజాశక్తి-క్యాంపస్: కౌమార దశలోని పాఠశాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలను నేర్పించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ హై స్కూల్ లో నిర్వహిస్తున్న మూడు రోజుల జీవన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వివిధ వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగానే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ వారి సహకారంతో కౌమార దశలోని పాఠశాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలను నేర్పించడానికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బాబు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ పరిశీలకులు కె.సతీష్ బాబు, డైట్ అధ్యాపకులు, స్టేట్ రిసోర్స్ గ్రూప్ సభ్యులు చెంగల్రాజు, ప్రభాకర్, శ్రీనివాసులురెడ్డి, రెడ్డి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ ప్రభాకర్‌రావు, భార్గవి, మ్యాజిక్ బస్ రీజినల్ మేనేజర్ ఇగ్నీషియస్, మ్యాజిక్ బస్సు జిల్లా స్కూల్ సపోర్ట్ ఆఫీసర్ ప్రియదర్శిని, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమను నిరుద్యోగ యువతకు వివరిస్తాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాయలసీమ ప్రాంతంలో నివాసముండే నిరుద్యోగ యువతకు బంగారు భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ మిషన్ రాయలసీమ డిక్లరేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, రాయలసీమలోని ప్రతి నియోజకవర్గంలో యువతకు మిషన్ రాయలసీమ లక్ష్యాలను తెలుగు యువత ఆధ్వర్యంలో వివరిస్తామని తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్ తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ సీమ అభివృద్ధి బాట పట్టించేలా నారా లోకేష్ చేపట్టిన ఇవ్వగలం పాదయాత్రలో ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర సమయంలో ఏ విధంగా హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. వలసలు పోతున్న నిరుద్యోగ యువతకు చెక్ పెట్టి రాయలసీమలోనే ఉద్యోగాలు కల్పించే బాధ్యత టిడిపి అధికారంలోకి వస్తే తీసుకుంటుందని లోకేష్ తన పాదయాత్రలో వివరించారన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు కంకణాల రజనీకాంత్ నాయుడు, ఆర్ పి శ్రీనివాసులు, రాగల ఆనంద గౌడ్, కెవికె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో కొమ్మల కత్తిరింపులు ప్రధానం

ఉద్యాన శాఖాధికారి శివకుమారి



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: కోత అనంతరం మామిడి తోటల్లో కొమ్మల కత్తిరింపులు చాలా ముఖ్యమని ఉద్యాన శాఖాధికారి శివకుమారి రైతులకు సూచించారు. గోటూరువాండ్లపల్లి, తవ్వావాండ్లపల్లి,మ చిట్టేచెర్ల, దేవరకొండ, భాకరాపేట గ్రామాల్లో మామిడి తోటలను రైతులతో కలిసి పరిశీలిస్తూ రైతులకు సూచనలు చేస్తున్నారు. ముదురు తోటల్లో కొమ్మలు బాగా పెరిగి కలిసిపోవడంతో సూర్యరశ్మి సోకక చీడ పీడల బెడద పెరిగి, సస్యరక్షణ చర్యలు కష్టం కావడంతోపాటు దిగుబడులు, నాణ్యత తగ్గుతాయి. ముదురు తోటల్లో అన్ని చెట్లపై ఆకార నిర్వహణ (కేనపీ మేనేజ్మెంట్ ప్రక్రియ) చేయాలి. అవసరం మేరకు నాటు రకాలు, నాణ్యతలేని రకాలు, దిగుబడి ఇవన్నీ చెట్లను తలమార్పిడి (టాప్ వర్కింగ్)విధానంతో లాభసా టి రకాలుగా మార్చుకోవాలి. జూలై, ఆగస్టు నెలల్లో తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దున్నాలి. చెట్లకు 100 కిలోల పశువుల ఎరువు చేయాలి. నీటి వసతి కల్గిన తోటల్లో కిలో యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్పేట్, 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి. పిందెలు గోలి సైజులో ఉన్నప్పుడు (జనవరి -ఫిబ్రవరి) మిగతా కిలో యూరియా 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలి. వర్షధారం తోటల్లో ఆగస్టు నెలలోనే 2 కిలోల యూరియా 5 కిలోల సూపర్ ఫాస్పేట్ , 1.5 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలి. పొలంలో ఖాళీలు ఉన్నట్లయితే 3 సంవత్సరాల వయస్సు మొక్కలు తెచ్చి ఖాళీలలో నాటి పెంచాలి. ఎరువులను చెట్టు మొదలుకు 4-5 అడుగుల దూరంలో చేసిన గాడిలో వేసి మట్టితో కలిపి నీరు పారించాలి. జులై, ఆగస్టులో పచ్చిరొట్ట పైర్లు జనుము, పెసర, పిల్లి పెసర, అలసంద, ఉలవలు లాంటి పంటలు వేసి పూతదశలో కలియదున్నాలి.

అక్టోబర్ 15 లోపల రెండవసారి దుక్కి దున్ని కలుపు పెరగకుండా నివారించాలి. కాండం, బెరడు తొలిచే పురుగులను గమనించి రంధ్రంలో పెట్రోలు, డైక్లోరోవాస్ తో తడిపిన దూది ఉండను చొప్పించి బంకమట్టితో కప్పేయాలి. చెదల నివారణకు 5 మి. లి. క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి కలిపిన ద్రావణంతో మొదలు, కొమ్మలపై పిచికారీ చేసి చెట్టు చుట్టూ నాలుగువైపులా గునపంతో ఒక అడుగులోతు రంధ్రం చేసి అందులో పోయాలి. లేదా ఫోరేట్ /ఫురడాన్ గుళికలు 25 గ్రా॥ చొప్పున ఒక్కో రంధ్రంలో వేయాలి. డ్రిప్ పద్ధతిని ఏర్పాటుచేసి చెట్టుకు 6-8 డ్రిప్పర్లు అమర్చి తగినంత నీటిని పారించాలి.

జింక్, బోరాన్ దాతువుల లోపాలు సాధారంగా మామిడి చెట్లపై కన్పిస్తాయి. ఈ సూక్ష్మధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్ సెల్ఫేట్, 2 గ్రాముల బోరాన్ లీటరు నీటికి చొప్పున కలిపి గాని ఫార్ములా-4 పొడిని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున గాని కలిపి 20 రోజుల వ్యవధి 2-3 సార్లు పిచికారీ చేయాలి. కాయల కోత తర్వాత తోటల్లో పడిఉన్న టెంకలను, ఎండు పుల్లలను ఏరి కాల్చివేయాలి. మామిడి చెట్లపై తట్లపరుగు ఆశించి ఆకులను, చిగుళ్లను ఒక చోటికి చేర్చి గూళ్లని, ఆకులను గోకి తింటూ ఎండిపోవడానికి, పూత తగ్గిపోవడానికి కారణం అవుతుంది. దీని నివారణకు గూళ్లను చెదరగొట్టి 2 మి.లి క్వినాల్ ఫాస్ లేదా క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. సరైన యాజమాన్యం చేపడితే మంచి దిగుబడి సాధించి అధిక లాభాలు పొందవచ్చని సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మతి



ప్రజాశక్తి-తడ: తడ మండలంలోని చేనిగుంట కాలనీ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మతిచెందాడు. నెల్లూరు నుంచి చెన్నై కు వెళుతున్న రైలు ఉదయం ప్రాంతంలో ఢీకొన్నట్లు సమాచారం. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు రక్ష



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: తలారిపెట్టు, కళ్లివెట్టు పంచాయతీలలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహశీల్దారు భార్గవి, ఎంపీడీవో డీవీ నరసింహారావు పాల్గొని ప్రజలకు పథకాలపై వివరించారు. కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకొచ్చిందన్నారు. అర్హతలుండి లబ్ధి పొందలేని వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బిరియాని పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్డులో అల్ ఇస్లాం పవర్ టూల్స్ షాపు వద్ద శుక్రవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు బిరియానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకుడు సయ్యద్ నయీమ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా అల్ ఇస్లాం పవర్ టూల్స్ పేరుతో ప్రతి శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి శుక్రవారం 70 మంది వద్దులు, దివ్యాంగులు, గిరిజనులకు బిరియానీ ప్యాకెట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్. హసన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు..



ప్రజాశక్తి -రేణిగుంట : వెదళ్లచెరువు ప్రాథమిక పాఠశాల విదార్థులకు శుక్రవారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా నోటుపుస్తకాలు, విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్థాల రవిబాబు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సంస్థ సభ్యులు డాక్టర్ డి కోదండరామిరెడ్డి, బీబీఏ విద్యార్థి అక్షయ, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

గుర్రప్పశెట్టి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ నేత, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గుర్రప్ప శెట్టి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు పిలిస్తే పలికే వ్యక్తి, నిగర్వి, మంచికి మారుపేరైన గుర్రప్ప శెట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ఆనందంగా ఉందని నాయకులు వంకాయల సిద్దులయ్య, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి, మాజీ టౌన్ బ్యాంక్ ఛైర్మన్ డి.వి.నారాయణ, వైస్ ఛైర్మన్ షేక్. ఖాదర్ బాషా, అనిల్,పూల శేఖర్, జె.గణేష్, రాజా, సుబ్రమణ్యం, జీవా, సయ్యద్ ఖాజా అన్నారు.

16న చంద్రగిరిలో లవకుశ నాటక ప్రదర్శన



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు చంద్రగిరి బస్టాండు క్లాక్ టవర్ సెంటర్ వద్ద గొప్ప భక్తిరస నాటకమైన లవకుశను ప్రదర్శిస్తున్నట్లు ఆ కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రగిరిలో వెలసిన అత్యంత పురాతనమైన శ్రీ కోదండ రామస్వామి ఆలయం ఎంతో ప్రాచుర్యమైనదన్నారు. కోదండ రామస్వామి ఆలయ ప్రాశస్థితను మరింతగా ప్రచారం చేస్తూ భక్తులకు తెలియజేయాలని సంకల్పంతో లవకుశ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామన్నారు. నాటకంలోని ప్రతి ఘట్టాన్ని వాస్తవానికి దగ్గరగా ఆవిష్కరించి భక్తులను మైమరిపించేలా అద్భుత సెట్టింగులు మధ్య కళాకారులచే నాటకాన్ని ప్రదర్శిస్తామన్నారు. తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ నాటకానికి విచ్చేసి తిలకించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఉపాధ్యక్షులు డి. గోపాల్ రావు, సాంబోల హరినాథ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు అందించాలి



ప్రజాశక్తి-గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలోని సెమినార్ హాల్ లో శనివారం గూడూరు డివిజన్ విద్యుత్ అధికారులతో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ వారి సబ్ డివిజన్ పరిధిలోని అభివద్ధికి సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించమని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు తెలుసుకుంనేందుకు డివిజన్ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని, వినియోగదారునికి సంతృప్తికర సేవలు అందిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ ఆపరేషన్ కె. గురవయ్య ,చీఫ్ జనరల్ మేనేజర్ రెవెన్యూ అండ్ ఇంటర్నల్ ఆడిట్ కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని , నెల్లూరు సర్కిల్ సూపరిం టెండింగ్ ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్య ,సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ షేక్.ఇస్మాయిల్ ,శ్రీధర్,రాఘవేంద్ర ,బెనర్జీ ,మధు,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్,అసిస్టెంట్ ఇంజనీర్స్ , అకౌంట్స్ విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మహిళ వర్సిటీ విసి ఆచార్య భారతి



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకళపతిగా అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మహిళా వర్సిటీ విసి ఆచార్య డి భారతి మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి మహిళా వర్సిటీ ఉప కులపతిగా నియమించినందుకు జగన్మోహన్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపాను అన్నారు మహిళా వర్సిటీ పరిపాలన అభివృద్ధి అక్కడ మీకు అంశాలు వివిధ కోర్సులు అవస్థాపన సౌకర్యాల గురించి చర్చించడం జరిగింది అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన ఆచార్య డి భారతి గురువారం విజయవాడలోని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తనపై నమ్మకంతో ఉపకులపతిగా బాధ్యతలు ఇచ్చినందుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భారతి విశ్వవిద్యాలయంలో జరుగుతున్నటువంటి అభివద్ధి పనులను గురించి వివరించారు.

మార్కెట్లోకి కియా నూతన స్టెల్లాస్ రీబోర్న్ ఆవిష్కరణ



ప్రజాశక్తి - మంగళం : కార్ల ఉత్పాదక సంస్థ కియా తన కొత్త మోడల్ స్టెల్లాస్ రీబోర్న్ కారును చెన్నై బెంగళూరు రహదారిలోని హెూషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సి జగన్నాథ్ రెడ్డి ఆవిష్కరించి మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సి జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ కియా నుండి నవీకరించబడిన స్టెల్లాస్.ఎస్ యు వి కారులో ఎక్స్టీరియల్ మరియు ఇంటీరియల్ నందు ఆధునిక మార్పులు చేయడంతో పాటు ఫేస్ లిఫ్టడ్ పెద్ద గ్రిల్, ముఖ్యంగా ఎయిర్ డ్యాం తగ్గింపుతో ఇవ్వడం జరిగిందన్నారు. ఈ వెహికల్ అప్డేట్ చేయబడిన హెడ్లైట్లు, కొత్త ఎల్ఈడి, డి ఆర్ ఎల్ లను కలిగి ఉంటుంది, 17 అంగుళాల అలైవీల్, ఆరు ఎయిర్ బ్యాగులతో ఇన్ఫోటైన్మెంట్ మరియు ఇన్స్టుమెంటల్ క్లస్టర్ కోసం డ్యూయల్ స్క్రీన్ కలిగి ఉంటుంది, ఇందులో పనోరమిక్ సన్ రూఫ్, యాడాన్ ఫ్యూచర్లు కలిగి ఉంటుంది. ఇందులో నూతన ఫ్యూటర్ టర్ ఆలివ్ కలర్ అందుబాటులో ఉంటుంది. 1.5 లీటర్ పెట్రోల్ మరియు డీజిల్ వీరియంట్ల ఇంజిన్ ను ఎంపిక చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చెలికం రాజశేఖర్ రెడ్డి, భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి, డాక్టర్ వెంగమ్మ, డాక్టర్ పార్థసారధి రెడ్డి, డైరెక్టర్ చెరకు నిరంజన్, సి భారతి, సి పోషిమారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంతకు ప్రైవేటు ఆర్మీలా పోలీసులు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రంలోని పోలీసులు నియంతగా పేరుగాంచిన సీఎం జగన్మోహన్ రెడ్డికి ప్రైవేటు ఆర్మీలా వ్యవహరిస్తున్నారని జనసేన పార్టీ పీఏసీ సభ్యులు పసుపులేటి హరిప్రసాద్ వ్యాఖ్యానించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాళహస్తి పట్టణంలో జనసేన నాయకులు కొట్టే సాయిపై అంజు యాదవ్ వ్యవహరించిన తీరు నిరసిస్తూ ఆమెను వెంటనే సస్పెండ్ చేయాలని విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీ నేషనల్ మీడియా ఇన్‌ఛార్జి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసులు ఐపిసి కోడ్‌ను ఫాలో అవుతున్నారా లేక వైసిపి కోడ్‌ను ఫాలో అవుతున్నారా అని ప్రశ్నించారు. మద్రాస్ హైకోర్టు పలు సందర్భాలలో దిష్టిబొమ్మ దగ్ధాలు అనేది ప్రతిపక్షాల హక్కుగా చెప్పిందన్నారు. కోర్టు తెచ్చిన తీర్పులు పోలీసులకు తెలియకపోవడం విస్మయానికి గురిచేస్తుందన్నారు. బహిరంగంగా వాలంటీర్లు ముసుగులో వైసిపి నాయకులు పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తుంటే అప్పుడు మాత్రం పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్లు అమల్లోకి రావా అని ప్రశ్నించారు. జనసేన నాయకుడు కొట్టేసాయి మాట్లాడుతూ నేను దిష్టిబొమ్మ దగ్ధం చేయడానికి ప్రయత్నించడం లేదని సమాధానం చెబుతున్నలోపే సీఐ అంజుయాదవ్ దురుసుగా వ్యవహరిస్తూ చేయి చేసుకున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీగా నిరసన వ్యక్తం చేసే హక్కు కలిగిన మాపైన అంజు యాదవ్ వ్యవహరించిన తీరుపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే స్పందించిన మానవ హక్కుల కమిషన్ సీఐ అంజుయాదవ్‌కు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత, రాజారెడ్డి, చంద్రబాబు, కృష్ణయ్య, రాఘవయ్య, ఆనంద్ పాల్గొన్నారు.